
# నాయుడు

**'రావు'**




"నాయుడూ" మరిడయ్య పిలికేక విని, వడుస్తున్న నాయుడు చెరువుకట్ట దిగి, చింత తోపులోకి దారితీశాడు. ఆరిపోయిన బీడీ చెవిలోంచి తీసి వెలిగిస్తూ "దొర కబురెట్టాడు. గంటాలమ్మ తిరణాలయిన ఆఖరి రోజున అయిదు వందలూ ముట్టచెప్పకపోతే మాట—దక్కదన్నాడు. ఆటు పైన నీ యిష్టం" అన్నాడు మరిడయ్య, నాయుడు కేసి తీక్షణంగా చూస్తూ.

"తిరణాలు మూడురోజు లున్నాయి. తిరణాలు మూడు రోజులు జరుగుతాయి. ఆరోజుల్లో అయిదు వందలు ఎలా సంపాయించేది ? ఓ రెండు నెలలు గడువు కావాలి. అదీ కాక ......"

"నాకేం తెలియదు నాయుడూ, దొర—మాట చెప్పాను. లేకపోతే...." బీడీ నేలమీద పడేసి కాలితో నలిపి పారేశాడు మరిడయ్య. నాయుడు మరి మాట్లాడలేదు. దొరకి వచ్చేప్పుడం కష్టం. అన్న నాటికి అయిదు వందలూ యివ్వకపోతే .... దొర అన్నంత పని చేసి తీరతాడు. నాయుడు గుండెల్లో రాయిపడింది. నీరసంగా అడుగు లేసుకుంటూ కట్టమీదికి దారి తీశాడు.

రావిచెట్టు తిన్నెమీద కూర్చున్నారు. ఊరంతా హడావుడిగా ఉంది; సంక్రాంతి రోజులు. గంటా

—42 వ పేజీ చూడండి



# శ్రీదేవి

తమ్ముడు శేఖర్—ఇద్దరూ ఎంత ప్రయత్నించినా రజని—బెంగ మాన్పలేకపోయారు.

యూనివర్సిటీలో చేరిన వెలరోజుల అనంతరం ఒకనాడు శ్రీదేవీ, రజనీ, సాయంకాలం మార్కెట్‌కు బస్సులో వెళ్తూంటే, హేమలత కన్పించింది.

"ఇదేమిటి? నువ్వెప్పుడొచ్చావు ఇక్కడికి?" అని శ్రీదేవి హేమలత నడిగింది.

"హమ్మయ్యా! మొత్తానికి మిమ్మల్ని కలుసుకున్నాను. ఎప్పుడు కలుసుకుంటానా అని చాలా ఆత్రుతగా ఉన్నాను. అన్నయ్య చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నాడు."

"ఆఁ! ఎక్కడ?" శ్రీదేవి ఖంగారుగా అడిగింది.

"హాస్పిటల్లో"

"పద! వెళ్దాం" అంది శ్రీదేవి. రజని, "బాబు వచ్చారా, అమ్మా?" అని అడిగాడు. తను అవునంది.

హేమలత దారిలో విషయమంతా చెప్పింది. శ్రీదేవి వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ, ఆనంద్ చాలా విచారంగా ఉండసాగాడట. ఎప్పుడూ గదిలో కూర్చొని సిగరెట్లు కాలుస్తూ, ఏదో ఆలోచిస్తూ ఉండేవాడట. ప్రాక్టీసు పూర్తిగా మానేశాడట. అతని వాలకం చూసి రాజాగారు, ఆయన—భార్యా చాలా బెంగ పెట్టుకున్నారట. ఇంట్లో ఆనంద్ ఎవరితోనూ మాట్లాడడం మానేశాడట. అయిదు రోజుల క్రితం, రాజాగారు కొడుకు—మనసు మార్పుకై, ఎవరో పేషెంటును చూడడానికి బలవంతంచేసి ఆనంద్‌ను పంపారట. పరధ్యానంగా కారు డ్రైవ్ చేస్తూ, 'యాక్సిడెంట్'లో చాలా గాయాలు తగిలించుకున్నాడట. ఒంటినిండా గాయాలతో అతన్ని ఇంటికి చేర్చారట ఎవరో! చేతి ఎముకకు ప్రమాదకరమైన గాయం తగిలిందట. వెంటనే రాజాగారి కుటుంబమంతా వాల్తేరు వచ్చి, ఆనంద్‌ను కె. జి. హెచ్.లో అడ్మిట్ చేశారట. ఆ క్రితంరోజే ఆపరేషను జరిగిందట. డాక్టర్లు ఫరవాలేదని చెప్తున్నారట గాని, తలిదండ్రులు చాలా బెంగపెట్టుకుంటున్నారట.

"ఎప్పుడూ మిమ్మల్నీ, రజనినీ తల్చుకుంటూ ఉంటాడు" అంది హేమలత. శ్రీదేవికి దుఃఖం పొంగుకొచ్చింది. తనెంత కఠినహృదయురాలు! ఆనంద్—ప్రేమను తిరస్కరించటే గాని, తననూ, రజనినీ అంతగా ప్రేమించే వ్యక్తి ఈ జీవితంలో తనకు లభిస్తాడా?

స్పెషల్‌వార్డులో, గదిద్వారంవద్ద రాజాగారు నిల్చొని ఉన్నారు. శ్రీదేవినీ, రజనినీ చూసి, వరండాలోనే ఆగమని సౌంజ్ఞచేశారు. శ్రీదేవి ఆగింది. రాజాగారు ఆమెను, తనతో కొద్దిదూరం తీసుకెళ్లారు. హేమలత గదిలోకి వెళ్లింది.

"చూడమ్మా! ఆనంద్ పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. వాడు నీకోసం, రజనికోసం చాలా బెంగపెట్టుకుంటున్నాడు. వాడు నిన్ను ప్రేమించినట్లు తోస్తోంది. నీ అభిప్రాయం వాడికి చెప్పావా?" అని అడిగారు.

శ్రీదేవి తలవంచుకొని, ఏమీ జవాబివ్వలేదు. ఆమె కంటినుండి అశ్రువులు రెండు రాలి పడ్డాయి.

"వాడి పరిస్థితి చాలావరకు నీమీద ఆధారపడి ఉందని నా నమ్మకం. నువ్వు వాడిని అంగీకరించినట్లయితే వాడు మనకు దక్కుతాడని నా నమ్మకం. ఈ ముసలివాడిమీద ఆమాత్రం దయచూపించ గలవా, తల్లీ!" అన్నాడాయన మెల్లిగా.

ఇక ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చింది శ్రీదేవి. రజనికూడా, ఏం చెయ్యాలో తెలియక ఏడ్చేశాడు.

"ఆయన మనసు గ్రహించలేక, పొరపాటుపడి ఆయన్ని కష్టపెట్టాను. నన్ను క్షమించండి" అంది.

ఆ సమయంలో, అంతవరకు రజని—చెయ్యి పట్టుకున్న శ్రీదేవి, తన కళ్లు తుడుచుకోడానికి వాడి చెయ్యివదిలింది. వెంటనే రజని పరిగెత్తి ఆనంద్-గదిలోకి వెళ్ళిపోయాడు. అది చూసి, రాజాగారూ, శ్రీదేవీ నవ్వారు.

"నువ్వుకూడా వెళ్ళమ్మా; నీ సాన్నిధ్యంలో వాడు పూర్తిగా కోలుకుంటాడు. నీ భవిష్యత్తును గురించి గాని, రజని గురించి గాని ఏమీ భయపడకు. ఆనంద్ చాలా మంచివాడు. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాడు. మీరిద్దరూ సుఖంగా ఉండాలని నే నాశీర్వదిస్తున్నాను" అన్నారాయన.

శ్రీదేవి ఆయనవద్ద సెలవు తీసుకొని, ఆనంద్ వైపు నడచి వెళ్ళింది...

**-అయిపోయింది. ★**

---

# నాయుడు

12 వ పేజీ తరువాయి

లమ్మ తిరణాలకి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏటిపొడుగునా దిక్కూ దివాణం లేనట్లుగా పడి ఉన్న గంటాలమ్మ గుడి అందరూ కలిసి బాగుచేశారు. నాయుడులో ఉత్సాహం ఏ కోశానా లేదు.

దొరని కసితీరా తిట్టుకొన్నాడు. ఖర్మ కాలి దొర సాంగత్యం కలిసింది. మేడగుట్ట సంతకెళ్ళి ప్రొద్దు క్రుంకిన తర్వాత కావిడేసుకొని ఉలవలు మోసుకొస్తుంటే, దారి అటకాయించాడు దొర. "రంగసామి—దుకాణం దోచుకొస్తుంటే, పోలీసులకు కబురందీ, మన ఊరుచుట్టూ మాటు పెట్టారు. ఈ అయిదు వందలూ నీ దగ్గర దాచు. తర్వాత నే వచ్చి తీసుకొంటా. చెప్పినట్టు చేస్తే పాతిక రూపాయి లిస్తాను. ఏమంటావ్?" మీసం మెలివేస్తూ అన్నాడు దొర. "నీ దొంగసొమ్ము నా దగ్గర దాచను. నీ కే సహాయం చెయ్యలేను" అన్నాడు నాయుడు బిక్కుబిక్కు మంటూ.

"నా మాట నెదిరించి బ్రతకలేవు నాయుడూ" అంటూనే దొర అయిదు వందలూ ఉలవలకింద దాచాడు. నాయుడు కిక మార్గం లేకపోయింది. మాట్లాడకుండా ఊళ్లోకి దారితీశాడు.

అయితే పోలీసులు దొరని పట్టుకొన్నారు. డబ్బు దొరకలేదు. నాయుడుకి గాభరా వేసింది. డబ్బు ఎక్కడ దాచేది. పోలీసుల కందజేస్తే, నమ్మరేమో? తనకే బేడీలు తగిలించవచ్చు. ఒకవేళ నమ్మినా, దొర జైలునుంచి తిరిగివచ్చాకతనని బ్రతుకనిస్తాడని నమ్మక మేమిటి? డబ్బు ఎక్కడ దాచేది. తాతల కాలం నుంచి వస్తూన్న కావిటి పెట్లో దొంగసొమ్ము దాచడానికి నాయుడు మనస్సు అంగీకరించలేదు. ఉలవల కావిట్లోనే ఉంచేసి మూల—గదిలో ఉంచాడు.

కరణంగారి పొలంలో పనికెళ్లి తిరిగి వచ్చేసరికి పెరటి గుమ్మం తెరచిఉంది. మూల—గదికి వేసిన తాళం బ్రద్దలుకొట్టా రెవరో. గదంతా ఉలవలు చిందరవందరగా పడున్నాయి. ఆతృతతో చూశాడు. అయిదు వందలూ లేవు. నాయుడు గుండె ఝల్లుమంది. దొర—ముఠాలోవాడే ఎవడో కాజేసుంటాడు. ఎవరితో చెప్పుకునేది?

దొర విడుదలయి బయటికి వచ్చాడు. "నాటకమాడుతున్నావా, నాయుడూ? దొరని మోసం చెయ్యలేవు. పదిహేను రోజులు గడువిస్తున్నాను. డబ్బు యిచ్చి తీరవలసిందే" నాయుణ్ణి దబాయించి పోయాడు దొర ఆ లోపుగానే మున్సబుగారు కబురంపారు పైడిపాలెం వెళ్లవలసిందిగా. తిరిగి వచ్చేసరికి వారం మయిపోయింది. మరిడయ్య చేత కబురంపాడు అప్పుడే! ఊరు విడిచి పారిపోవాలి! కాని ఎలా? దొర దగ్గర పప్పు లుడకవు. పోలయ్యనాయుడు—కూతురు 'రామి' ని వదలి ఎలా పారిపోయేది? అయిదు వందలూ యిచ్చి తీరాలి. రామితో మనువాడ్డానికని నిల వేసుకుంటూ వచ్చిన సొమ్ము వంద—దాకా కావిడి పెట్లో ఉంది. ఇంకా నాలుగు వందలు ఎక్కణ్ణించి తెచ్చేది? కూర్చుంటే లాభంలేదు. ఏదో ప్రయత్నం చెయ్యాలి.

పేరినాయుడుతో చెప్పాడు జరిగిందంతా. "నీ ఖర్మ కాలి అలా జరిగింది. నేనూ ప్రయత్నిస్తాను. ఈలోపులో నీ ప్రయత్నాల్లో నువ్వుండు" అన్నాడు పేరినాయుడు సిగరెట్టు పొగ వదుల్తూ.

అప్పటికే చీకటి పడింది. చలిగాలి వీచసాగింది. యింటికి పోయి ముసుగు తన్నాడు నాయుడు. రాత్రి తెల్లవార్లూ పీడ—కలలే.

ఝాము ప్రొద్దెక్కిన తర్వాత మెలుకువ వచ్చింది నాయుడికి. శేషయ్య—కొట్టుకెళ్లి టీ తాగి, స్నానం చేశాడు. కావిడి—పెట్టె తెరచి, తల్లి యిచ్చిన ఒంటిపేట—గొలుసూ, ఉంగరం తీసుకొన్నాడు. నాయుడు మనస్సు వేదనతో నిండిపోయింది. "కోడలు—పిల్ల గడపలో కాలు పెట్టగానే నా పేరున దాని కివ్వాలి సుమా ఈ రెండూనూ" తల్లి ఆఖరి కోరిక తను తీర్చలేక పోతున్నాడు. రామిని పెళ్లి చేసుకొన్న తర్వాత గొలుసు ముచ్చటగా దాని మెళ్లో అలంకరిద్దా మనుకొన్నాడు. బావి దగ్గర చంద్రుడి సాక్షిగా రామి వ్రేలికి ఉంగరం తొడుగుదా మనుకున్నాడు. ఎన్నో కలలు; అన్నీ కల్లే!

"రెండింటిమీదా ఎనభై రూపాయిలకన్నా ఎక్కువ ఇవ్వలేను" అన్నాడు షావుకారు.

"నీకు పుణ్యముంటుంది. రెండు వందలు యివ్వరాదూ?" నాయుడు బ్రతిమిలాడుకొన్నాడు.

"ధర లేదు నాయుడూ! ఎక్కువ యిచ్చినా తాకట్టు విడిపించుకోలేవు. ఎనభై కంటే కాసి

